

నిరుడు ఇదే రోజుల్లో అమాంతంగా పెరిగిన తేజా మిర్చి ధరలు ప్రస్తుత సీజన్‌లో తిరోగమనం దిశగా పయనిస్తున్నాయి. దీంతో ఆరుగాలం కష్టించి తీరా మార్కెట్‌కు పంటను తీసుకొచ్చిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఆశలు, కోర్కెలు పెట్టుకొని సాగు చేసిన రైతులకు ధరలను చూసి దిగ్భ్రాంతికి గురవుతున్నారు. రైతు చేతి నుంచి పంట చేదాటిన మరుసటిరోజు నుంచి అమాంతంగా ధరలు పెరగడం, తీరా రైతు చేతికి పంట వచ్చేసరికి పంట ధర తగ్గడం పరిపాటిగా మారింది. ప్రతి ఏటా ఖమ్మం జిల్లావ్యాప్తంగా తేజా రకం పంటను సాగు చేసిన రైతులకు ఇదే అనుభవం ఎదురవుతున్నది. ఇందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ ప్రధానంగా జాతీయస్థాయిలో మిర్చికి మద్దతు ధర లేకపోవడమే అంటున్నారు అధికారులు. రైతు పండించిన ప్రతి పంటకూ మద్దతు ధర ఉన్నప్పటికీ మిర్చి పంటకు లేకపోవడంతో ఖరీదుదారులకు వరంగా మారింది.

–ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 15



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

- పంట చేతికొచ్చే సమయంలో తిరోగమనం
- ఆందోళన కలిగిస్తున్న విదేశీ ఎగుమతులు
- మద్దతు ధర లేక రైతుల ఇబ్బందులు
- జెండాపాటలో క్వింటా ధర రూ.16,900



రాష్ట్రవ్యాప్తంగా తేజా రకం మిర్చి పంటను ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లా రైతులు మాత్రమే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ రకం పంట ఘాటైనది కావడంతో 90 శాతం పంట ఇతర దేశాలైన చైనా, థాయ్‌లాండ్, బ్యాంకాక్, సింగపూర్‌కు ఎగుమతి జరుగుతుంది. సాధారణం రకం పంటను ఇక్కడే ప్రాసెసింగ్ చేసి వినియోగంలోకి తీసుకొస్తుంటారు. ప్రతి ఏటా ఖమ్మం మార్కెట్‌కు జిల్లా రైతులతోపాటు పొరుగు జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, కృష్ణా జిల్లాల నుంచి రైతులు తీసుకొస్తున్నారు. గత ఏడాది సాగు చేసిన మిర్చి పంటకు సైతం ఇదే పరిస్థితి ఎదురు కావడంతో సదరు రైతులు కోల్డ్ స్టోరేజీల్లో పంటను నిల్వ చేసుకున్నారు.

# ఎండు మిర్చికి 'ధరే'ది?

సీజన్ ఆరంభం నుంచి మిర్చి ధరలు తగ్గడానికి ప్రధాన కారణం ఇతర దేశాలు, రాష్ట్రాలకు ఎగుమతులు లేకపోవడమే. దీంతో వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు ఎగుమతి చేస్తున్నారు. సాధారణంగా ఏసీరకం మిర్చి పంట ప్రతి ఏటా చైనా, థాయ్‌లాండ్, బ్యాంకాక్, సింగపూర్ దేశాలకు ఎగుమతి అవుతుంటుంది. గత సంవత్సరం కోల్డ్ స్టోరేజీలు పూర్తిగా ఖాళీకావడంతో ఇదే అదనుగా భావించిన రైతులు, కొందరు వ్యాపారులు భారీ మొత్తంలో పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. రికార్డు స్థాయిలో 40 లక్షలకు పైగా బస్తాలను నిల్వ చేసుకున్నారు. క్వింటాల్ రూ.18 వేల నుంచి రూ.20 వేలు పలికినప్పటికీ రాబోయే రోజుల్లో మరింత ధర పెరుగుతుందని భావించి పంటను దాచుకున్నారు. పక్షం రోజుల నుంచి అంచెలంచెలుగా ధరలు తగ్గుతూ గురువారం నాటికి రికార్డు స్థాయికి తగ్గిపోయాయి. గురువారం నగర వ్యవసాయ మార్కెట్‌లో ఏసీ రకం మిర్చి క్వింటా రూ.16,900 పలుకగా.. కనిష్టంగా క్వింటా రూ.7 వేల చొప్పున ఖరీదుదారులు పంటను కొనుగోలు చేశారు. మిర్చి పంటకు మద్దతు ధర లేకపోవడంతో ధరలు తగ్గడం.. తద్వార రైతులు ఆర్థికంగా నష్టపోవడానికి ప్రధాన కారణమవుతుందని రైతు సంఘాల నాయకులు తెలుపుతున్నారు. మిర్చి పంటకు మద్దతు ధర లేకపోవడంతో తాము చెప్పిందే మద్దతు ధర అని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.



ఖమ్మం ఏఎంసీకి రైతులు తెచ్చిన మిర్చి బస్తాలను దిగుమతి చేస్తున్న హమాలీలు



మధిర తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

# వంద పడకల ఆసుపత్రిని.. వెంటనే ప్రారంభించండి

- సీపీఎం ఆధ్వర్యంలో మధిర తహసీల్ ఆఫీసు ఎదుట నిరసన
- అనంతరం ప్రభుత్వ దవాఖాన వద్ద నినాదాలు.. ఆందోళన..

మధిర, నవంబర్ 15: నిర్మాణం పూర్తయిన వంద పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మధిరలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలపడంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు శీలం నరసింహారావు మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించడం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం మధిరలో చేపట్టిన వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయిందన్నారు. దీనిని ప్రారంభించాల్సిన నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు తీరిక లేకపోవడంతో నిరుపయోగంగా మారిందని ఆరోపించారు. వెంటనే ఆసుపత్రిని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పడకంటి మురళి, మందా సైదులు, ఓట్ల శంకర్‌రావు, వజ్రానపు మధు, పాపినేని రామనర్సయ్య, తేలప్రోలు రాధాకృష్ణ, గౌర్రాజు ధనలక్ష్మి, షేక్ ఉద్దండు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాలకు.. సకాలంలో చేరుకోవాలి

**గ్రూప్-3 పరీక్షలకు 27,984 మంది అభ్యర్థులు: ఖమ్మం కలెక్టర్ ఖాన్**



కలెక్టర్ ముజమ్మిల్

మామిళ్లగూడెం, నవంబర్ 15: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ గ్రూప్-3 పరీక్షలకు అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ప్రకటనలో సూచించారు. నవంబర్ 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు జరుగతాయని తెలిపారు. నవంబర్ 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఈ పరీక్షలకు 27,984 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, వారికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామని వివరించారు. అభ్యర్థులు ఉదయం సెషన్‌కు 8:30 లోపు, మధ్యాహ్నం సెషన్‌కు 1:30 లోపు రావాలని, ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం 2:30 గంటలకు గేట్లు మూసివేస్తారని, ఆ తరువాత ఎవరినీ లోపలికి అనుమతించరని స్పష్టం చేశారు.

## 'భద్రాద్రి'లో 13,478 మంది అభ్యర్థులు



ఏసీ వేణుగోపాల్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు భద్రాద్రి అదనపు కలెక్టర్ (ఏసీ) వేణుగోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 13,478 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నిర్దేశిత సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, లాగ్ టేబుల్స్, బ్యాగులు కేంద్రాల్లోకి తీసుకెళ్లడానికి వీలు లేదని పేర్కొన్నారు. అభ్యర్థుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నందున మెహందీ, టాటూలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

- గత ఏడాదితో పోలిస్తే రూ.వెయ్యి కోట్ల కన్నా ఎక్కువ స్థూల లాభం
- స్వయంగా అన్ని శాఖల అధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ బలరాం
- సింగరేణి సంస్థలో స్ఫూర్తినిచ్చిన రోజువారీ అవగాహన సదస్సులు

# అర్ధభాగంలో అదుర్స్

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 15: సింగరేణి సంస్థ గడిచిన ఏడు నెలల కాలంలో గత ఏడాదితో పోలిస్తే రూ.వెయ్యి కోట్ల కన్నా ఎక్కువ లాభాలు గడించి ముందుకు దూసుకెళ్తున్నది. తొలుత బొగ్గు ఉత్పత్తికి కొన్ని అవాంతరాలు ఏర్పడినప్పటికీ వర్షాలు, వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత తన వినియోగదారులకు తగినంతగా బొగ్గు ఉత్పత్తిని సరఫరా చేస్తున్నది. సంస్థ సీఎండీ బలరాం ప్రతిరోజూ అన్ని ఏరియాల జీఎంలతో ఉత్పత్తిపై ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహిస్తూ.. అవాంతరాలను అధిగమించేందుకు దిశా నిర్దేశం చేస్తూ లక్ష్య సాధన దిశగా సమాయత్తం చేస్తున్నారు. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ తొలగింపులో గణనీయమైన వృద్ధి కనిపిస్తున్నది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ వార్షిక ఉత్పత్తి లక్ష్యం 720 లక్షల టన్నులను సాధించాలని సింగరేణి వ్యాప్తంగా అధికార యంత్రాంగం సమాయత్తమై పనిచేస్తున్నది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు బొగ్గు విక్రయం ద్వారా రూ.17,151 కోట్లు, విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.2,286 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు బొగ్గు, థర్మల్ విద్యుత్ అమ్మకాల ద్వారా పన్ను చెల్లింపునకు ముందు రూ.4 వేల కోట్ల స్థూల లాభాన్ని కంపెనీ ఆర్జించింది. గతేడాది ఇదే సమయానికి ఆర్జించిన రూ.2,932 కోట్ల మీద ఇది రూ.1,072 కోట్లు అదనం కావడం విశేషం. మొత్తంమీద గత ఏడాదితో పోలిస్తే సింగరేణి సంస్థలో స్థూల లాభంపై 36 శాతం వృద్ధి నమోదైంది.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ షురూ..

**ఖమ్మం పటేల్ స్టేడియంలో పోటీలను ప్రారంభించిన డీఈవో సోమశేఖర శర్మ, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి**

ఖమ్మం సిటీ, నవంబర్ 15: 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డీఈవో సోమశేఖర శర్మ, డీవైఎస్‌వో తుంబూరి సునీల్‌రెడ్డి, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్, విద్యావేత్త రవిమారుత్, డి.ప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించామన్నారు. పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి దాదాపు 320 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మొదటి రోజు 600 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్ అంశాల్లో పోటీలు నిర్వహించగా.. క్రీడాకారులు తమ వ్యక్తిగత ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నరసింహమూర్తి, షఫిక్ ఈ పోటీలను పర్యవేక్షించారు.



విజేతలను అభినందిస్తున్న డీఈవో సోమశేఖర శర్మ, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

### విజేతల వివరాలు ఇలా..

బాలుర 600 మీటర్ల పరుగు పందెంలో కే జాకేష్ (ఆదిలాబాద్), కే లవ్‌లిత్, ఎం.చరణ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో ఎం.రాజేశ్వరి (వరంగల్), ఎండీ సమీరా (కరీంనగర్), టి.పల్లవి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. బాలుర షాట్‌పుట్ విభాగంలో జే సాత్విక్ (ఆదిలాబాద్), బీ నరేశ్ (ఖమ్మం), ఎస్.వంశీ (మహబూబ్‌నగర్), బాలికల లాంగ్‌జంప్ విభాగంలో అన్విత (రంగారెడ్డి), వై శృతిహాసన్ (ఖమ్మం), టీఎస్ ధన్యశ్రీ (హైదరాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

# పోరాట యోధుడు 'బిర్సా ముండా'

- ఐటీడీఏలో ఘనంగా జయంతి వేడుకలు
- పాల్గొన్న కలెక్టర్ జితేశ్ పాటిల్, ఎమ్మెల్యేలు



ఖమ్మంలో గిరిజన నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



బిర్సా చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న భద్రాద్రి కలెక్టర్

భద్రాచలం, నవంబర్ 15: బిర్సా ముండా తాను చదువుకునే రోజుల్లోనే ఆదివాసీ హక్కుల కోసం మిలిటెంట్ ఉద్యమాన్ని నడిపి వారికి ఆరాధ్యదైవంగా మారాడని, ఆయన పోరాట యోధుడని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. పీఎం దర్తీ ఆలా జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం సందర్భంగా భద్రాచలం ఐటీడీఏలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. తొలుత కలెక్టర్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ కలిసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదివాసీల భూములను వారికి తిరిగివ్వాలని తెగ పెద్దలతో కలిసి తెల్లదొరలపై బిర్సా ముండా పోరాడారని వివరించారు. తొలుత గిరిజనుల నృత్యాలు, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు శంకర్‌రావు, డేవిడ్‌రాజు, విద్యా చందన, మణెమ్మ, తానాజీ, రాంబాబు, రమణయ్య, అలివేలు, మంగతాయారు, లక్ష్మీనారాయణ, భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మంలో..

మామిళ్లగూడెం, నవంబర్ 15: 19వ శతాబ్దానికి చెందిన ఆదివాసీ ప్రజా నాయకుడు.. బిర్సాముండా అని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈయన నేతృత్వంలో ఉల్గులాన్ అనే గొప్ప బిర్సాముండా 150వ జయంతి వేడుకలను ఖమ్మంలోని గిరిజన భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్తీ ఆలా భగవాన్ బిర్సా ముండా జయంతిని కేంద్ర ప్రభుత్వం నవంబర్ 15న జన జాతీయ గౌరవ దివస్‌గా నిర్వహిస్తున్నదని గుర్తుచేశారు.



భక్తుల కోలాహలంతో భద్రాద్రి గౌతమీ తీరం

- ఉభయ జిల్లాల్లో కార్తీక పౌర్ణమి సందడి
- తెల్లవారుజాము నుంచే భక్తుల శివనామ స్మరణ
- భద్రాద్రి గోదావరి తీరంలో కార్తీక పూజల కోలాహలం
- భక్తులతో కిటకిటలాడిన కూసుమంచి శివాలయం

# 'దీపం' నమఃశివాయ

*పరమ శివుడికి ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి రోజున శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భద్రాచలం గోదావరి తీరంలో, అన్నపురెడ్డిపల్లి శివాలయంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. నదీ తీరాన నియమ నిష్టలతో పూజలు చేశారు. అరటి దొప్పలు, తమలపాకులపై ప్రమిదలు పెట్టి దీపాలు వెలిగించారు. నైవేద్యాన్ని సమర్పించి తనివితీరా శివయ్యను కొలిచారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించి భక్తులు చేరుకోవడంతో భద్రాద్రి సీతారామచంద్రస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శివాలయం కిక్కిరిసిపోయింది. అలాగే, ఉభయ జిల్లాల్లోని ప్రముఖ శివాలయాల్లో మహా న్యాస, ఏకాదశ పూర్వక రుద్రాభిషేకాలతో పూజలు ప్రారంభమయ్యాయి. కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు, మణుగూరు ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తులసి, ఉసిరి, మారేడు చెట్ల కింద మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి భక్తిభావాన్ని చాటుకున్నారు. అయ్యప్ప, భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. కూసుమంచి శివాలయానికి ఖమ్మంతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్, కృష్ణా జిల్లా, హైదరాబాద్ జిల్లాల భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు చేశారు.*

*–భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ భద్రాచలం/ కూసుమంచి, నవంబర్ 15*



ఇల్లెందులో..



భద్రగిరి శివాలయంలో..





గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు



కూసుమంచి శివాలయంలో..





వీవీ పాలెంలో..





అన్నపురెడ్డిపల్లిలో..